పనులు పూర్తయ్యేదెప్పుడో ?

- అసంపూర్తిగా రామవరం-మర్రిపాక రోడ్డు నిర్మాణం
- మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రామవరం-మర్రిపాక మార్గంలో సగం భాగం వేసి వదిలేసిన సిమెంట్ రోడ్డు



ఎదురుగా వాహనం వస్తే తప్పించుకునేందుకు దారేదీ..!

జగ్గంపేట: కూటమి ప్రభుత్వంలో ప్రచారం.. ఆర్భాటాలు తప్ప పనులు సక్రమంగా జరగడం లేదని ప్రజలు మండి పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు అధ్వానంగా ఉండేవని, తమ ప్రభుత్వం వచ్చాక అద్దంలా మార్చేస్తున్నామని కూటమి నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప క్షేత్రస్థాయిలో పనులు మాత్రం చేయడం లేదు. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందగా రోడ్ల పరిస్థితి మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా..

జగ్గంపేట మండలం రామవరం నుంచి మర్రిపాక వరకూ రూ.84 లక్షలతో వేస్తున్న సిమ్మెంట్ రోడ్డు తీరు ప్రజల ఆగ్రహానికి కారణమవుతోంది. విషయానికి వస్తే 20 అడుగుల వెడల్పులో 300 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు పనులు మొదలు పెట్టి మూడు నెలలు గడుస్తోంది. కొంత దూరం వరకూ 20 అడుగుల వెడల్పుతో రోడ్డు బాగానే వేశారు. అక్కడి నుంచి మరికొంత దూరం కేవలం 10 అడుగుల వెడల్పు వేసి మరో పది అడుగులు వదిలేశారు. రోడ్డు వేయకుండా వదిలేసిన ప్రాంతంలో ఒక పక్క రోడ్డు ఎత్తుగా మరో పక్క రోడ్డు లోతుగా మారింది. దీంతో ఆ ప్రాంతంలో గృహస్తులతో పాటు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు పల్లంగా ఉన్న ప్రాంతంలోని ఇళ్లలోని కార్లు కాని, మోటారు సైకిళ్లు కాని బయటకు తీయడానికి దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బాగా ఎత్తుగా వేయడంతో వాహనాలు వెళ్లటం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామవరం మర్రిపాక రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వగ్రామం ఇర్రిపాక వెళ్లేందుకు ఇది దగ్గర దారి. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకునే దారి లేకండా పోతోందని పలువురు వాపోతున్నారు. గత మూడు నెలలుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లేందుకు దారిలేదు



మా ఇంటిలో చంటి పిల్లలు ఉన్నారు. వారిని తరచూ కాకినాడ, రాజమహేంద్రవరం ఆసుపత్రులకు తీసుకువెళ్లవలసి వస్తోంది. మా ఇంట్లో కారు ఉంది. దానిని బయటకు తీయాలంటే దారి లేకుండా పోయింది. దీంతో వేరు వాహనాలు పెట్టకుని వెళ్లవలిసి వస్తోంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదు.

– జక్కి సురేఖ(గృహిణి), రామవరం, జగ్గంపేట మండలం

కూలీలు దొరకడం లేదు

రామవరం రోడ్డు పనులు మూడు నెలలుగా ఆగిపోవడం వాస్తవమే. ప్రజలకు అసౌకర్యం కలుగుతున్న మాట నిజమే. రోడ్డు పని మొదలు పెడితే కేవలం నాలుగు లేక ఐదు గంటల్లో పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తాం. మూడు నెలలుగా కూలీలు దొరకడం లేదు.

– సాయి కిరణ్, ఆర్అండ్‌బీ ఏఈ, జగ్గంపేట

ఎండీఎం కార్మికులకు వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రొంగల ఈశ్వరరావు

ప్రత్తిపాడు: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) కార్మికుల వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు, పిల్లల వంట బిల్లులు మంజూరు కాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి కనీస వేతనాలు లేకపోవడం, గ్యాస్ సిలిండర్లు ఇవ్వకపోవడంతో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే రూ.3 వేల వేతనంలోనే ఖర్చు చేయాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, పనికి గుర్తింపుగా యూనిఫాం, ఐడీ కార్డులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. పాఠశాలల ఆయాలకు చీపుర్లు, బ్లౌజులతో పాటు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల ఎండీఎం కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ వరలక్ష్మి, యూనియన్ నాయకులు అనంతలక్ష్మి, శింగార లక్ష్మి, సుబ్బలక్ష్మి, అమ్మాజీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



తునిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శివదత్

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో టీ20 పవర్ క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ బోడపాటి శివదత్ గురువారం ప్రారంభించారు. శుక్రవారం నుంచి మ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముగింపు వేడుకలకు రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో బోడపాటి కాంతం, దండెం రామకృష్ణ, బోడపాటి శ్రీను, జల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురి కావద్దు



కేజీబీవీ విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

తుని రూరల్: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులు ఫలితాలపై మానసిక ఒత్తిడికి గురికావద్దని కాకినాడ జిల్లా బాలికా సంరక్షణ అధికారి ఉమామహేశ్వరి సూచించారు. మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో గురువారం పది పరీక్షలు రాసిన విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్ష ఫలితాల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మీ ప్రయత్నం, సంకల్పం దృఢంగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉత్తీర్ణత సాధిస్తామో ? లేదో ? అని మానసిక ఒత్తిడికి గురికావద్దన్నారు. మనోధైర్యంతో ఉండాలన్నారు. విద్యార్థినులకు జిల్లా సమగ్ర శిక్ష తరఫున సలీమా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం



తేటగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు

తుని రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు అన్నారు. మండలంలోని కేఓ మల్లవరం, వి.కొత్తూరు, హంసవరం, తేటగుంట గ్రామాల్లో గురువారం మాస్టర్ ట్రైనర్ ఎ.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రకృతి సాగుపై అవగాహన సదస్సులు, పాఠశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. వి.కొత్తూరు అవగాహన సదస్సులో లోవరాజు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. భవిష్యత్ అంతా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులదే అన్నారు. మార్కెట్ అవసరాలకు అనువుగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించి ఉత్పత్తులు పెంచాలన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రూపొందించి రానున్న ఆరు నెలల్లో అమలు చేస్తామని ఎంటీ రామకృష్ణ తెలిపారు. ఏఓ బి.అశోక్ కుమార్, మాజీ సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు, విద్యార్థులు, వీఏఏలు, విహెచ్ఏలు, వీఆర్వోలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సోమన్నచౌదరి

కిర్లంపూడి: విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని విశ్రాంత ఉపాధ్యాయుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. మండలంలోని ఆర్‌బీ కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి గురువారం ఆయన పుస్తకాలు బహూకరించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు పలు అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎండ్రు రామారావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో సారా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పరారైన నిందితుడు మువ్వల కాటమరాజుపై కేసు నమోదు చేశామని స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా
- కోటనందూరులో కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

కోటనందూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి, ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా సూచించారు. కోటనందూరులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో అభిప్రాయ బేధాలకు తావులేదన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులంతా సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు అండగా నిలవాలన్నారు. కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలకు లోబడి కార్యకలాపాలు సాగించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలకు కష్ట కాలంలో పార్టీ అండగా ఉంటుందన్నారు. కనీసం సంవత్సర కాలం ముగియక ముందే అధికార పార్టీపై వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది పార్టీని సమర్థవంతంగా నడిపించేందుకు అధిష్టానం చర్యలు చేపట్టిందన్నారు. భవిష్యత్‌లో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారందరికీ మంచి గుర్తింపు లభిస్తుందని, పార్టీ అధినేత జగన్ ఆ దిశగా అడుగులేస్తున్నారని చెప్పారు. పార్టీ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గొర్లి రామచంద్రరావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు లంక ప్రసాద్, వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు వెలగా వెంకటకృష్ణాజీ, నాయకులు కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, కురందాసు రాంబాబు, నారాయణమూర్తిరాజు, దార్ల సూర్యచంద్ర, ఉల్లూరి శ్రీను, చిటికెల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన



వాకదారిపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ సత్యస్వరూప

తొండంగి: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థులకు గురువారం ఒకేషనల్ కోర్సులపై అవగాహన కల్పించారు. కెరియర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఆర్.సత్యస్వరూప వివిధ ఒకేషనల్ కోర్సులు, వాటి వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. గతంలో చదివిన తరగతుల్లో మార్కులను ప్రాతిపదికన తీసుకోకుండా ఎప్పటికప్పుడు సరైన మార్గదర్శకత్వంలో మానసిక ఒత్తిడి, భయానికి గురికాకుండా ఉన్నత విద్యకు బాట వేసుకోవాలన్నారు. దీనికి కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల ప్రభావానికి విద్యార్థులు గురవుతున్నారని, దీనిపట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి చిన్న విషయంపై తల్లిదండ్రులకు పూర్తి సమాచారం అందివ్వాలన్నారు. ఆలోచనలకు అనుగుణమైన కోర్సులను ఎంచుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ రాజేశ్వరసీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సంఘ అధ్యక్షుడు, వైద్యుడు విజయబాబు

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం వారపు సంతను పురస్కరించుకుని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సంఘ సభ్యుడు వడ్డి క్రిస్టియన్‌బాబు ఆర్థిక సాయంతో స్థానిక మెయిన్‌రోడ్‌లోని ఆపోలో మెడికల్ షాపు సమీపంలో మజ్జిగ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు, వైద్యుడు ఎస్.విజయబాబు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గోళ్ల నాగేశ్వరరావు, సభ్యులు రౌతు సహదేవుడు, సిరిపరపు బాబూరావు, చలంచర్ల నాగేశ్వరరావు, చందువోలు రాజా తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

గంగాధర్‌కు నంది అవార్డు



అవార్డు గ్రహీతను అభినందిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన బొల్లు వెంకటకృష్ణ గంగాధర్‌ను తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుతో సత్కరించింది. ఉగాదిని పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ హాస్యనటుడు, మాజీ మంత్రి ఎం.బాబూమోహన్ చేతుల మీదుగా గంగాధర్ నంది అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత గంగాధర్ మాట్లాడుతూ అందరి బంధువులం-అయ్యప్ప సేవకులం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం తనకు నంది అవార్డును ప్రదానం చేసిందని తెలిపారు. అవార్డు గ్రహీతను శబరిమల ప్రధాన అర్చకులు మురళి నంబూద్రి, గురుస్వామి దండపాణి కుమారుడు వేలు గురుస్వామి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, స్థానిక నేత బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు, ఉపాధ్యక్షుడు నానిపల్లి శ్రీనివాస్, దొడ్డిపట్ల సుబ్బరాజు తదితరులు అభినందించారు.

హేమజ్యోతికి అభినందనలు



హేమజ్యోతిని అభినందిస్తున్న డీఈఓ రమేష్

తుని రూరల్: అంధత్వాన్ని జయించి ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ ప్రతిభతో ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డు గెలుపొందిన తుని మండలం హంసవరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని గింజాల హేమజ్యోతిని డీఈఓ రమేష్ అభినందించారు. గురువారం కాకినాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హేమజ్యోతిని శాలువాతో సత్కరించారు. ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేయాలని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ పుల్లా పద్మజ, విద్యార్థిని తండ్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

శంఖవరం: గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా ఘటనలో మరికొంత మంది ఉన్నారని, వారిని కూడా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దళితులు ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం మెడలో చెప్పుల దండ వేసిన వారిలో ఒకరిని మాత్రమే అరెస్టు చేశారన్నారు. ఈ ఘటనలో మరికొంత మంది పాత్ర ఉందని, వారిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పోలీసు పికెటింగ్ నిర్వహించారు.

రాజపూడిలో సామూహిక సీమంతాలు



రాజపూడిలోలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

జగ్గంపేట: మండలంలోని రాజపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషికాహార మహోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ గర్భిణులకు స్వీట్లు, దుస్తులు, పండ్లు అందజేసి సీమంతాలు చేశారు. పౌష్టికాహార ప్రాధాన్యతను పూర్ణిమ వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బూసాల విష్ణు, రేఖా బులిరాజు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన నొక్కు దావిద్ ఇటీవల పాము కాటుకు గురయ్యాడు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దావిద్‌ను మురళీ కృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దావిద్‌కు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, తూపాటి బాబ్జి, యాళ్ల ఏసు, జువ్వల ముసలయ్య, తోట భాస్కర్, అంబటి గణేష్, కుడుముల శ్రీను, వెంటిపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘బడి పిలుస్తోంది’ కరపత్రం ఆవిష్కరణ



పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం బడి పిలుస్తోంది పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాట్రాతి వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు గాను ప్రత్యేకంగా ప్రచార కరపత్రాన్ని రూపొందించి ఆవిష్కరించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పరిసర గ్రామాల్లో పర్యటించారు. హైస్కూల్లో డిజిటల్ విద్యతో పాటు విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, సహపాఠ్య కార్యక్రమాల తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. బడిబయట పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ బద్ది రాంబాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రత్తిపాడు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రత్నరాజు



తునిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తుని: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్ని మాపక కేంద్రం అధికారి కె.రాముడు సూచించారు. స్థానిక డీమార్టు ప్రాంగణంలో గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాదాల నివారణపై అగ్ని మాపక విన్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.భాస్కరరావు, జీవీ రమణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రత్తిపాడు: ప్రస్తుత వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం ఆఫీసర్ ఎంజే రత్నరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడులోని పలు పాఠశాలల్లో గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వంటింట్లో గ్యాస్ ఫైర్ అయినప్పుడు ఎలా ఎదుర్కోవాలో వివరించారు. అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తత ముఖ్యమన్నారు. ప్రమాదం జరిగితే భయపడటం, ఆందోళన చెందకుండా ప్రమాదాల నివారణపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు లీకుల వల్ల కలిగే ప్రమాదాలను ఎలా నివారించాలి ? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో... వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పి.సత్యనారాయణ, ఎం.సతీష్‌బాబు, టి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు



ప్రత్తిపాడులో స్తంభించిన ట్రాఫిక్

ప్రత్తిపాడు: మండల కేంద్రం ప్రత్తిపాడును ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. స్థానిక మెయిన్‌రోడ్డు అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి తుని వైపు వెళ్లే రోడ్డు చిన్నదిగా మారడంతో బస్సులు, లారీలు తదితర వాహనాలు వచ్చేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వాహనదారులు, పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఈరోడ్డు వెంబడి ఉండే దుకాణాల వద్ద కొనుగోలుదారుల వాహనాలు నిలపడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తొలగేలా రోడ్డు విస్తరణ చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.